నవతెలంగాణ
ఆదిలాబాద్
1
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో పనులు ప్రారంభం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి గ్రామంలో ఈజీఎస్ స్కీములో మంజూరైన రూ.8లక్షలు, ఎస్సీ సబ్ ప్లాన్‌లో మంజూరైన రూ.11లక్షలతో సిసి రోడ్డు పనులను శనివారం మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మిరాజేశ్వర్, మాజీ ఎంపిటిసి వెంకన్న యాదవ్, విలాస్ యాదవ్, కుమ్మరి నడిపెన్న, పొచ్చన్న, వడ్డెర రాజమల్లు, పన్నాల సిద్ధార్థరెడ్డి, రావుల నారాయణ పాల్గొన్నారు.



భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

మంచిర్యాల : డివిజన్ పరిధిలోని భూ సమస్యల పరిష్కానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం ఆర్‌డిఓ కార్యాలయంలో మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ఆర్.ప్రకాష్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు మండల్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. రెండు వారాల్లో వచ్చిన దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మండల్ లెవెల్‌లో పరిష్కారం కాని సమస్యలు ఏవైన ఉంటే వాటిని డివిజన్ కమిటీకి పంపాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



క(వ)డగండ్ల వాన..!

- రైతులకు కన్నీరు మిగిల్చిన అకాల వర్షం
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో భారీగా పంట నష్టం
- నేల కొరిగిన మొక్కజొన్న, దెబ్బతిన్న వరి
- పరిహారం చెల్లించాలని అన్నదాతల వేడుకోలు

ఎండ తీవ్రతకు తాళలేక జనం ఓ వైపు ఉక్కిరిబిక్కిరవుతుండగా..ఒక్కసారిగా వచ్చిన వర్షం అవస్థలకు గురిచేసింది. అకస్మాత్తుగా వచ్చిన వడగండ్ల వాన..అన్నదాతలకు కడగండ్లను మిగిల్చింది. ఏపుగా ఎదిగిన పంట ఈదురు గాలులు, రాళ్ల వర్షం తీవ్రతకు తట్టుకోలేక నేలకొరిగింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో అధికంగా నష్టం సంభవించగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రాంతంలోనూ భారీగానే పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల తీవ్రతకు షెడ్డు గోడ కూలి కాగజ్‌నగర్‌కు చెందిన ఓ వృద్దుడు మృతి చెందారు. పలు ఇండ్లపై కప్పులు ఎగిరిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. ఈ వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెబుతున్నారు. శనివారం ఆదిలాబాద్, జిల్లాలోనూ అక్కడక్కడ అకాల వర్షం కురవడంతో పలు పంటలకు నష్టం వాటిల్లింది.



దండేపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



కౌటాలలో విద్యుత్ తీగలపై పడిన భారీ వృక్షం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దండేపల్లి

ఓ వైపు రాష్ట్రంలోనే అధిక ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లాలోనే నమోదవుతున్నాయి. ప్రతి రోజూ ఏకంగా 40 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడం.. అకస్మాత్తుగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో అంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. బలమైన గాలులతో పాటు అక్కడక్కడ రాళ్ల వర్షం కురవడంతో రబీ పంటలు వేసిన అన్నదాతలకు నష్టం చేకూర్చగా.. ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న జనానికి చల్లని వాతావరణం ఉపశమనం కలిగిస్తోంది. శుక్రవారం మంచిర్యాల జిల్లా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, జన్నారం మండలాల్లో వర్ష తీవ్రత అధికంగా ఉండగా.. దండేపల్లి మండలంలో మొక్కజొన్న, వరి పంటలు నేలకొరగడంతో భారీగా నష్టం వాటిల్లింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్(టి) తదితర మండలాల్లో వండగండ్ల వర్షం కురవగా.. ఆయా ప్రాంతాల్లో మొక్కజొన్న, మిర్చి, ఇతర కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులు భీభత్సం సృష్టించడంతో పలు ఇండ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. షెడ్డు గోడ కూలడంతో నౌగాం బస్తీకి చెందిన దౌలత్(70) అనే వృద్ధుడు మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

రబీ పంటలకు తీవ్ర నష్టం..!

ఉమ్మడి జిల్లాలో అన్నదాతలు ప్రతి ఏటా యాసంగి పంటలు సాగుచేస్తుంటారు. ఖరీఫ్‌లో పంట దిగుబడి రాకపోయినా రబీలో వేసిన పంటల ద్వారా దానిని పూడ్చుకుంటారు. తాజాగా రబీలోనూ అకాల వర్షం కారణంగా పంటలకు నష్టపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఈ సమయంలో ఎక్కువగా మొక్కజొన్న పంటను వందలాది ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ఈ పంట ద్వారా వచ్చిన ఆదాయం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుంది. కానీ తాజాగా కురిసిన వడగండ్ల వర్షం కారణంగా పంటంతా నేలకొరిగింది. ఏపుగా పెరిగి.. మరికొన్ని రోజుల్లో చేతికొస్తుందని భావించిన అన్నదాతల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లినట్లయింది. వ్యవసాయశాఖ అధికారులు పంటల సర్వే ప్రారంభించారు. దండేపల్లిలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనూ వాతావరణం చల్లబడటంతో పాటు మేఘాలు కమ్ముకోవడంతో ఏ క్షణమైనా వర్షం రావచ్చని అంచనా వేస్తున్నారు.



తీవ్రంగా నష్టం జరిగింది : ముత్తినేని సుమన్, రైతు, దండేపల్లి

రబీ సీజన్‌లో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఏపుగా పెరగడంతో పాటు మరికొన్ని రోజుల్లో చేతికి రానుంది. కానీ అకస్మాత్తుగా వచ్చిన వడగండ్ల వర్షంతో పంటంతా నేలకొరిగింది. పంట కోసం వెచ్చించిన పెట్టుబడి అంతా వర్షార్పణమైంది. ప్రభుత్వం సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.



ప్రాథమికంగా అంచనా వేశాం : అంజిత్‌కుమార్, ఏఓ, దండేపల్లి

అకాల వర్షం కారణంగా మండలంలో సుమారు ఏడు గ్రామాల్లో పంట నష్టం జరిగింది. రాళ్ల వర్షం తాకిడికి 85 ఎకరాల వరకు పంటంతా నేలకొరిగింది. ప్రస్తుతం ప్రాథమికంగా నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి అందజేస్తాం.

జిల్లా కేంద్రంలో భారీ రాళ్ల వాన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు రాళ్లు కూడా పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం వారసంత కావడంతో జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుండి మామూలుగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా మారి భారీ ఎత్తున వర్షం పడింది. దీంతో ప్రజలకు కొంత ఇబ్బందిగా మారింది. మరో రెండు రోజులపాటు వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదేమైనా కొన్ని రోజుల నుండి అత్యధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వర్షం తెచ్చిన చల్లదనం సంతోషాన్ని నిచ్చింది.

కెరమెరి : 20 రోజులుగా పెరుగుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మండల ప్రజలకు శనివారం మారిన వాతావరణం కాస్త ఉపశమనం కలిగించింది. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం ఝరి, మోడీ, కెరమెరి, సాంగ్వి తదితర గ్రామాల్లో కురిసింది. ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. దాదాపు గంటపాటు దంచి కొట్టింది. దీంతో మండల కేంద్రంలోని పలు వీధులు జలమయమయ్యాయి. ఈ వర్షంతో శుక్రవారం సాయంకాలం చల్లబడింది. ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి హట్టి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడడంతో ఆసిఫాబాద్ నుండి ఉట్నూరు వైపు, ఉట్నూర్ నుండి ఆసిఫాబాద్ వైపు రాకపోకల కొనసాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల జొన్న పంట నేలకొరిగింది.

ఐటీఐ కళాశాలలో జాబ్ మేళాకు స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ కింద ఒక రిజిస్టర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉద్యోగం కొరకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. శనివారం కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు వివిధ ట్రెడ్స్ లలో ఐటీఐ పాసైన విద్యార్థులు పలు ప్రాంతాల నుండి వచ్చారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో హాజరు కాగా కంపెనీ ప్రతినిధులు విశాల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తగు సూచనలు చేశారు. పనిచేసే ప్రదేశం, వేతనాలు, సౌకర్యాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి మిల్కా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో జాబ్ మేళా నిర్వహకులు, కళాశాల సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 94వ వర్థంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ హర్ష డిగ్రీ కళాశాలలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు అయిన భగత్ సింగ్ చేసిన ఉద్యమాలను విద్యార్థులకు వివరించారు. ఆయన స్ఫూర్తితో యువత డ్రగ్స్, గంజాయిని వ్యతిరేకిస్తూ, భవిష్యత్తును కాపాడుకోవాలని తెలిపారు. చదువుకుంటేనే ఏదైనా సాధించవచ్చని, యువత ఏ సమస్య ఉన్నా భగత్‌సింగ్ లాగా ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతి ఒక్క విద్యార్థి ప్రశ్నించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గెట్ టు గెదర్

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం గెట్ టు గెదర్ కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం కష్టపడాలని తెలిపారు. డిగ్రీ పైచదువులు కూడా చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల కళాశాల నుంచి అవార్డు అందుకున్న గజెల్లి మోహన్, తెలుగు సదస్సులో పాల్గొన్న టి.రేణుబాబుగౌడ్‌ను ప్రిన్సిపాల్ సత్కరించారు. నెహ్రూ యువ కేంద్రం-మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రగతి యూత్ అసోసియేషన్ సమన్వయంతో క్లస్టర్ లెవెల్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన డిగ్రీ కళాశాల విద్యార్థులకు అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్, ప్రతినిధి సంజీవ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం

- తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్
- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆదివాసులు
- పోలీసులకు, ఆదివాసులకు తోపులాట
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అడవిలో ఉంటే టైగర్ జోన్ పేరిట వెళ్లగొడుతున్నారు..పట్టణంలో పిల్లల చదువు కోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉంటే కోట్ల విలువైన భూములని కనీస సౌకర్యాలు కల్పిండం లేదని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ అన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఉధృతం పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మావల మండలం సర్వే నంబర్ 72లోని కుమురం భీం కాలనీలో గుడిసేలు వేసుకోని నివాసముంటున్న ఆదివాసులకు పట్టాలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదివాసులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రధాన గేటు ఎదుట బైటాయించి సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఓ సమయంలో కలెక్టరేట్ లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కొంత సేపు వీరి మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడే యత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సౌకర్యాలు కల్పించే వరకు తాము ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. చివరకు కరెంట్ సౌకర్యం కల్పనకు సీఎండీకి లేఖ ఇస్తామని కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ ఏండ్ల క్రితం ఆదివాసులు తమ పిల్లల చదువుల కోసం ప్రభుత్వ భూమి అయిన 170లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారని తెలిపారు. సౌకర్యాలు కల్పించకపోయినా చందాలు వేసుకొని కరెంట్ పోల్స్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. కానీ విద్యుత్ అధికారులు కరెంట్ కట్ చేశారని ఆరోపించారు. ఆదివాసులు అన్నింట్లో ఎదగాలని చెబుతున్న అధికారులు, ప్రభుత్వం నీడ కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. కోట్ల విలువ చేసే భూములను రియల్టర్లు, ప్రజాప్రతినిధులు కాజేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే సర్వే 72 నుంచి ఎలాగైనా ఆదివాసులను ఖాళీ చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. ఆదివాసులకు న్యాయం చేయడంతో పాటు పట్టాలు, మౌళికవసతులైన కరెంట్, తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సౌకర్యాలు కల్పించకుండా కొంతమంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కోట్ల రూపాయలు ఒప్పందం చేసుకొని ఆదివాసులకు ఆ భూమి చెందకుండా విశ్వప్రయత్నలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం, ఇన్‌చార్జి మంత్రి మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి కుమురం భీమ్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఆదివాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, నీళ్ల కరెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆదివాసుల ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి ఏదైన జరిగితే వారిని అరెస్టు చేయడానికి వజ్ర లాంటి వాహనాలను సైతం సిద్ధం చేసి ఉంచారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లభారీగా బందోబస్తు చేపట్టి వారిని కట్టడి చేశారు. ఆందోళనలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు లలిత, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగ్‌నాథ్ పలువురు ఆదివాసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఎస్టీపీపీకి మరో రెండు అవార్డులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జాతీయ స్థాయిలో మరో రెండు అవార్డులు అందుకుంది. గోవాలో కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్సీ వారు నిర్వహించిన కార్యక్రమం ద్వారా ఎస్టీపీపీ ఎస్ఈ (ఈఅండ్ఎం) అప్పారావు శనివారం అవార్డు అందుకున్నారు. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్సీ వారు నిర్వహించిన 4వ జాతీయ పవర్ జెనెరేషన్ ఎనర్జీ ఎఫిసియెంట్ అవార్డు-2025లో భాగంగా అవార్డు దక్కింది. ఎనర్జీ ఎఫిసియెంట్ యూనిట్ కేటగిరిలో 500 మెగావాట్స్ ఆపై గల థర్మల్ విద్యుత్ యూనిట్లలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిసియెంట్ యూనిట్ అవార్డు-2025 వరించింది. అదేవిధంగా పారిశ్రామిక రంగంలో మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన నేషనల్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఆఫ్ ఉమెన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్-పబ్లిక్ సెక్టార్ కేటగిరిలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ మేనేజర్ ఫారెస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారిణి చంద్రమణి సేవలకు గుర్తింపుగా అవార్డు లభించింది. ఇటీవల సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ చొరవతో మహిళా సాధికారతను ప్రోత్సహించే విధంగా మహిళా ఉద్యోగులకు బొగ్గు గనులు, విద్యుత్ కేంద్రానికి తీసుకోవడం జరిగింది. ఈ అవార్డులు రావడం పట్ల ప్లాంట్ ఇన్‌చార్జి ఈడీ కె.శ్రీనివాసులు, డైరెక్టర్ సత్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఈ అవార్డులు రావడం పట్ల సింగరేణి సీఎండీ బలరామ్ సింగరేణి సంస్థ చేపడుతున్న మహిళా సాధికారత పర్యావరణహిత చర్యలకు గుర్తింపు వంటిందని, సింగరేణి సంస్థ ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ముందుకు పోతుందని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

డీఈఓ పదో తరగతి పరీక్షా కేంద్రం తనిఖీ

నిర్మల్‌రూరల్ : జిల్లా విద్యా శాఖాధికారి రామారావు శనివారం దిలావర్‌పూర్ జడ్పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి సీఎస్, డీఓలకు పలు సూచనలు చేశారు. కాపీయింగ్ జరగకుండా అందరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ నుండి సరియైన సెట్ ప్రశ్నాపత్రాలను తీసుకోవాలని, జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లో సరియైన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో 9116 విద్యార్థులకు 9108 మంది హాజరయ్యారు.

నీటిని పరిరక్షించే బాధ్యత అందరిది

భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-కడెం

నీరు లేకుంటే మానవ మనుగడ అసాధ్యమని, జీవులన్నింటికీ నీరు చాలా అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని వృథా చేయకుండా పొదుపు చేయాలని జిల్లా భూగర్భ జల అధికారి పి.శ్రీనివాస్‌బాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల రైతులకు, మహిళ సమాఖ్య సభ్యులకు నీటి పొదుపు, నిత్యజీవితంలో నీటి ప్రాముఖ్యత, ఇంకుడు గుంతలు తదితర అంశాలపై భూగర్భ జల శాఖ అధికారులు అవల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జల శాఖ అధికారి మాట్లాడుతూ జీవులన్నింటికీ నీరు అవసరమని, ఎన్నో దేశాలు నీరు దొరకక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నీటిని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు నీటిని అందించిన వారమవుతామని తెలిపారు. డిఆర్డిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా ఉంటాయని తెలిపారు. భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆదర్శ రైతులు మల్లేష్, రాజమల్లు, బైరి గంగరాజును అధికారులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, మండల వ్యవసాయ అధికారి దినేష్, ఉద్యానవన అధికారి స్పందన, ఈజీఎస్ హెచ్‌ఆర్ సుధాకర్, మిషన్ భగీరథ ఏఈఈ అభిలాష్, నీటిపారుదల ఏఈఈ విశాల్, మండల పంచాయతీరాజ్ అధికారి కవిరాజ్, ఏపీఓ జయదేవ్, రైతులు, మహిళా సమాఖ్య సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కడెంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విజయలక్ష్మి



మందమర్రిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వర్

మందమర్రి : ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సండ్రోన్‌పల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఎంపీడీఓ రాజేశ్వర్, ఏఓ జి.కిరణ్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సకల ప్రాణ కోటి మనుగడకు నీరే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరు నీటి సంరక్షణకు పాటు పడుతూ పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఏఓ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా నీటి పొదుపు పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేస్తున్న దేశం ఇజ్రాయిల్ అని తెలిపారు. రైతులందరూ ఇజ్రాయిల్‌ను ఆదర్శంగా తీసుకుని సూక్ష్మ నీటి పారుదల పద్ధతులైన డ్రిప్, తుంపర్ల సేద్య పరికరాలు విరివిగా వినియోగించాలని తెలిపారు. వేసవిలో లోతు దుక్కులు దున్నుట, వాలుకి అడ్డంగా దున్నుట, పొలం గట్లపై లైవ్ ఫెన్సింగ్, ఆరు తడి పంటల సాగు తదితర పద్ధతుల ద్వారా నీటిని సంరక్షించుకొనే విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ భూగర్భ భౌతిక శాస్త్రవేత్త దివ్య వ్యవసాయ విస్తరణ అధికారి కనకరాజు, పంచాయతీరాజ్ ఏఈ ఇసాక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్దం జనార్దన్, గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎస్సై శ్రీకాంత్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేష్, స్థానిక ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిరుద్యోగులకు, విద్యారంగానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్ఎస్ నర్సాపూర్ మండల నాయకులు కోరారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు శనివారం నర్సాపూర్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, స్థానిక పోలీస్ స్టేషన్ తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ సుదాం, మండల మైనార్టీ అధ్యక్షులు రాయిస్‌ఖాన్, నాయకులు ప్రశాంత్ ఉన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కరీంనగర్ టూ టౌన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న కొరిపెల్లి సృజన్‌రెడ్డి సోదరులు కొరిపెల్లి మధుసూదన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శనివారం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రితో పాటు నిర్మల్ జిల్లా జెడ్పీటీసీ సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పాకాల ఫౌండేషన్ చైర్మెన్ పాకాల రామచందర్, రమణారెడ్డి, వినయ్, దేవేందర్‌రెడ్డి, సరోత్తమ్‌రెడ్డి ఉన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ కొలువులే కాకుండా ప్రయివేట్ రంగంలో కల్పించే ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మిల్కా అన్నారు. శనివారం ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ లైన్ అసెంబ్లింగ్ అసిస్టెంట్ ఆపరేటర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి పలువురు నిరుద్యోగులు పాల్గొనగా వారికి ఉపాధి వివరాలు వివరించారు. అనంతరం సర్టిఫికెట్‌లను పరిశీలించి సూచనలు చేశారు.

పేదలకు అండగా నిలిచేలా దాతలు ముందుకు రావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ మాసంలో పేదలకు అండగా నిలిచేలా దాతలు ముందుకు రావాలని వరల్డ్ మైమన్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు యూనీస్ అక్బానీ అన్నారు. శనివారం కైలాస్ నగర్‌లో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేదలకు 200 క్వింటాళ్ల బియ్యాన్ని 300 మందికి పైగా పేదలకు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 20 కిలోల చొప్పున అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గనైజేషన్ తరపున తొలిసారి పేదలకు అండగా నిలువాలనే ఉద్దేశంతో తన వినతి మేరకు బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తన వినతి మేరకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ఆర్గనైజేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. దాతలు కూడా పేదలకు సహకరించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు సయ్యద్ యాకూబ్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ సంబరాలు గ్రామ గ్రామాన నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ పార్టీ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామగ్రామన వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలవేణి శంకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని మండలాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. దీని కోసం ఇప్పటి జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశాల్లో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా శాసనసభలో కాంగ్రెస్ చట్ట పరమైన నిర్ణయాలు ప్రవేశపెట్టడం సంతోషకమైన విషయమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హర్షిస్తున్నామని, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్నలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు నళినిరెడ్డి, గోవర్ధన్, సిర్ర దేవేందర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం.. ఆర్‌ఎంపీ డాక్టర్ అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలానికి సంబంధించిన ఒక బాధితురాలని ఐదు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు తన అర్హతకు మించి వైద్యం అందించిన ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీ డాక్టర్ అరెస్ట్ అయ్యారని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. బాధితురాలని అస్వస్థతకు గురికావడానికి కారణమైన పీఎంపీ డాక్టర్‌ను మెడికల్ కౌన్సిల్ ద్వారా సరైన నిర్ధారణ చేసుకొని గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. బాధితురాలికి గర్భం దాల్చి ఐదు నెలల సమయంలో గర్భం పోవడానికి కావాల్సిన టాబ్లెట్లను చట్ట వ్యతిరేకంగా ఇచ్చినందుకుగాను డాక్టర్‌పై ఎంపీపీ యాక్ట్‌తో కేసు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేసి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి రెండో విడత మూల్యాంకనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని, రెసిడెన్సియల్, కేజీబీవీ, ఆదర్శ, ప్రయివేటు కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న వృక్ష శాస్త్రం, జంతుశాస్త్ర అధ్యాపకులు ఇంటర్మీడియట్ రెండో విడత మూల్యాంకనంకు పాల్గొనాలని డీఐఈఓ జాధవ్ గణేష్ శనివారం పేర్కొన్నారు. జంతు శాస్త్రం, వృక్ష శాస్త్రం ఈనెల 23న భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం ఈనెల 24న మూల్యాంకనం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అధ్యాపకులు రిపోర్ట్ చేయాలని సూచించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యాశాఖ మంత్రి నియమించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా ఐదో మహాసభలు శనివారం టిఎన్జీఓ భవన్‌లో నిర్వహించారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పూర్తిగా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో విద్యా రంగంలో అనేక సమస్యలు ఉన్నా పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనేక శాఖలకు మంత్రులు ఉన్న విద్యాశాఖకు మాత్రం మంత్రులను కేటాయించకుండా ముఖ్యమంత్రి దగ్గరనే శాఖ పెట్టుకుని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవి సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు పైచదువులకు దూరమవుతున్నారని తెలిపారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేసి, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న వాటిని మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అద్దెభవనంలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి, పెంచిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దిగంబర్, నితిన్, శేఖర్, అరవింద్, శివ, మహేష్, అక్షిత్ పాల్గొన్నారు.

భారత కళలు ఉట్టిపడేలా జిల్లాస్థాయి యువ ఉత్సవ్

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పల్లె జీవనం ప్రతిబింబించే నృత్యాలు.. సంస్కృతిలో ఆచార వ్యవహారాల ప్రదర్శనలు.. శాస్త్రీయ జానపద నృత్యాలు భారత కళలు ఉట్టిపడేలా జిల్లాస్థాయి యువ ఉత్సవ్ 2024-25 పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నేతృత్వంలో పోటీలు జరిగాయి. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయా విభాగాల్లో యువత చేసిన నృత్యాలు, ప్రదర్శనలు, పెయింటింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా నేహ్రూ యువ కేంద్రం అధికారి సుశీల్ భడ్ మాట్లాడుతూ యువ ఉత్సవ్ విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయాలు, జీవనశైలి తదతర అంశాలతో కూడిన నృత్యాలు చేసి ఆకుటున్నారన్నారు. ఏడు విభాగాల్లో పోటీలు జరిగాయన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారికి కూడా ప్రశంస పత్రాలను అందిస్తామన్నారు. విద్యార్థులు ఇలా పోటీల్లో పాల్గొని వారి నైపుణ్యాలు వెలికి తీసుకోవాలన్నారు. చదువుతో పాటు వారు ఎంచుకునే రంగంలో రాణించేలా కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సల్ల విజయ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్‌రామ్, రడాపు సంతోష్ కుమార్, అరుణ్ కుమార్, చక్రవర్తి, రమాకాంత్‌గౌడ్, శ్రావణి, మంజుల, జోత్స్న, రవి కిరణ్, జ్ఞానేశ్వర్, ఆనంద్ విద్యార్థులు, ఎన్వైకే సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌ను పదవి నుంచి తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జైనథ్ మార్కెట్ కమిటి చైర్మెన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, రైతులకు న్యాయం జరిగేలా వారి తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ జైనథ్ మండల ప్రధాన కార్యదర్శి గణేష్ యాదవ్ అన్నారు. ఈ విషయమై శనివారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జైనథ్ మార్కెట్‌లో అవినీతికి పాల్పడ్డ మార్కెట్ చైర్మెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ శనగ కొనుగోళ్లలో అమాయక ముఖద్దముల నుంచి జైనథ్ మార్కెట్ చైర్మెన్ డబ్బులు వసూలు చేశారని, సాక్ష్యాలతో సహా అవి బయటకు వచ్చాయని, గణేష్ యాదవ్ అన్నారు. వీరి కారణంగా కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన సదరు చైర్మెన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈ విషయంపై కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి స్పందించాలన్నారు. కాంగ్రెస్ అవినీతికి పెట్టింది పేరన్న విషయాన్నీ మరోసారి రుజువు చేశారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడమే తప్ప, అవినీతి పాల్పడ్డ దాఖలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తూ, అక్రమాలకు పాల్పడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుమ్మాల దేవన్న, లచ్చారెడ్డి, మేడిపట్ల స్వామి, జక్కుల అడెల్లు, గొడుగుల అడెల్లు పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లోని సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఫారెస్ట్ అధికారులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, తక్షణమే అభివృద్ధి పనులు జరిగేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం శాసన సభలో ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యలపై గళమెత్తారు. ఫారెస్ట్ ప్రాంతాల్లోని గ్రామాల్లో 3ఫేస్ కరెంటు అందించడానికి అధికారులు అడ్డుకుంటున్నారని, మండలంలోని గంగాపూర్ పరిసర ప్రాంతాలలో 3ఫేస్ కరెంటు ఏర్పాటు చేస్తే ఫారెస్ట్ అధికారులు ఆ గ్రామ ప్రజలను కార్యాలయాలకు పిలిచి ఇబ్బందులకు గురి చేసి, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని ఫారెస్ట్ సమస్యల కారణంగా ఆటంకం కలుగుతుందని సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దస్తురాబాద్ మండలంలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, అటవీ శాఖ మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు జారీచేసి అభివృద్ధి సక్రమంగా జరగడానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి



అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు 12 నెలల జీతం ఇవ్వాలని, వాటినే ఆటో రెన్యూవల్ పద్ధతిలో ఎంపిక చేసుకోవాలన్నారు.

నాలుగో రోజు సీసీఐ దీక్షలో విద్యార్థి సంఘాలు



దీక్షలో కూర్చున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ ప్రారంభం చేయాలని సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఈ దీక్షలు నాలుగో రోజుకు చేరుకోగా, విద్యార్థి సంఘాలు పాల్గొని సంఘీభావం తెలిపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీఐ ఫ్యాక్టరీపై కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఎంతోమందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాధన కమిటీ కోకన్వీనర్స్ విజ్జగిరి నారాయణ, ఈశ్వర్‌దాస్, వెంకట నారాయణ, జగన్‌సింగ్, అలాల్ అజయ్, వాగ్మారే ప్రశాంత్, మహేష్, సిడం సాయికుమార్, ఎర్రాజీ హరీష్, రాందాస్, అజయ్, సుదర్శన్, వినోద్, మారుతి, రాములు, సోమనాథ్, సంజయ్, సూరజ్, కళ్యాణ్, వినోద్, నిఖిల్‌రెడ్డి, అభిలాష్, హరీష్, రాహుల్, దత్త్రాతి, గణేష్ పాల్గొన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-తలమడుగు

ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సుంకిడి ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నీటి ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. గ్రామ నడిబొడ్డున ఉన్న కూడలిలో నీటిని పొదుపుగా వాడుతామని విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బి.గజానన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలవికాస కేంద్రం సమన్వయకర్త ప్రసూన్‌రెడ్డి మాట్లాడుతూ భూగోళంలో మూడు భాగాలు నీళ్ల, ఒక్క భాగం మాత్రమే భూమి ఉందని అయినా అందులో ప్రాణుల అవసరాలకు కేవలం ఒక శాతం మాత్రమే నీరు తాగడానికి వస్తుందని అందుకే నీటిని అవసరం ఉన్నంత మట్టుకే పొదుపుగా వాడుకొని భవిష్యత్ తరాలకు వాటిని అందించాలని కోరారు. రాబోయే రోజుల్లో చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. తమ సంస్థ బాలవికాస ద్వారా జిల్లాలో అనేక గ్రామాల్లో శుద్ధ జలాలను అందిస్తూ ప్రజల దాహార్తిని ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు వై.రామ్ రెడ్డి, సుకుమార్ పెట్కులే, ఆర్.సుజాత, సత్యనారాయణ, పీడీ నాందేవ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని మాలే బోరిగామ గ్రామపంచాయతీ, కుమురంభీం కాలనీలో శనివారం కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో హనుమాన్ మందిర్ షెడ్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సెడ్మకి ఆనంద్ రావు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి కుమురంభీం కాలనీలో రూ.8లక్షల నిధులతో పనులు మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి చించుఘాట్ గ్రామ పంచాయతీకి ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. ఆదివాసీ యువతకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు రూ.6లక్షలతో రాజీవ్ యువ వికాసం పథకం అందించేలా కృషి చేస్తామని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాగోని సుధాకర్‌గౌడ్, గ్రామ పటేల్ మేస్రం నాగారావు, దేవారీ మేస్రం గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలరని శనివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు భూక్య రమేష్ ఆధ్వర్యంలో డీడబ్ల్యూఓకు, సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు ప్రతినెల 5వ తేదీలోపు వేతనం చెల్లించాలన్నారు. రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చెల్లించాలన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ.18వేలు చెల్లిస్తామని హామీని అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో రమాదేవి, రాజేశ్వరి, లక్ష్మీ, విజయనిర్మల, మంగ, లక్ష్మి, యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.పద్మ కుమారి, కే.రాణి, దయాసాగరి పాల్గొన్నారు.

జాడి లక్ష్మీపతి మరణం పార్టీకి తీరని లోటు



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ మలిదశ ఉద్యమ కారులు జాడి లక్ష్మీపతి అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ లక్ష్మీపతి మృతిదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి వారి మృతదేహంపై బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ జెండాను కప్పారు. ఈ సందర్భంగా జనార్దన్ రాథోడ్ మాట్లాడుతూ లక్ష్మీపతి మరణించడం చాలా బాధాకరమని అన్నారు. ఉద్యమంతో పాటు పార్టీ కార్యక్రమంలో వారు చురుకుగా పాల్గొనే వారని, వారు లేని లోటు పార్టీకి తీరని లోటని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తు, వారి మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భారత్ చౌహన్, పార్టీ మండలాధ్యక్షులు పంద్రా జైవంత్‌రావు, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, కాటం రమేష్, సలీమోద్దీన్, సింగారే భారత్, కొమ్ము విజయ్, కలీం ఖాన్, అంజాద్ ఖాన్, నితిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని తేజాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధ టీకాలు, ఎండలు పెరుగుతున్నందున కలిగే పరినామాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం 38 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, పబ్లిక్ హెల్త్ నర్స్ క్రిస్టియాణ, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడీ టీచర్ ఉమా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని శనివారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గెల్లు యాదవ్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడిలో ముందస్తు సమాచారం మేరకు బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దుర్గం తిరుపతి, నాయకులు నికాడి మోహన్, శంకర్, శంషుద్దీన్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఆదరణకు నోచుకోని సీఎఫ్‌సీ

- మూతపడిన ఫర్నీచర్ తయారీ కేంద్రం
- ఉపాధి లేక ఇబ్బందుల్లో కార్మికులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు
- దృష్టిసారిస్తే వందలాది మంది యువతకు ఉపాధి

గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏ అమలుచేస్తున్న పథకాలలో సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలిటి సెంటర్) ఆదరణకు నోచుకోవడంలేదు. మండలకేంద్రంలోని ఈ కేంద్రానికి ప్రభుత్వం చేయూతనిస్తే ఫర్నీచర్ తయారీకేంద్రం మరింత మెరుగుపడే అవకాశం ఉండగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. యువతకు ఉపాధి కల్పించాల్సిన ఈ తయారీ కేంద్రం పనికిరాకుండా పోతోంది. వివిధ పథకాల పేరిట రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు ఇలాంటి ఉపాధి కల్పించే మార్గాలపై మాత్రం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. గృహ, కార్యాయాల అవసరాలకు ఉపయోగపడే వివిధ రకాల ఫర్నీచర్ తయారుచేసే ఇలాంటి కేంద్రాల పట్ల పాలకులు, అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఈ కేంద్రం నిర్వహించడం కష్టతరంగా మారుతోందని కార్మికులు వాపోతున్నారు. పదుల సంఖ్యలో కార్మికులకు ఉపాధినిచ్చే సీఎఫ్‌సీ సెంటర్‌పై ప్రత్యేక కథనం..



మూతపడిన సీఎఫ్‌సీ పరిశ్రమ

నవతెలంగాణ-వాంకిడి

ఉమ్మడిగా రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 1971లో రాష్ట్రవ్యాప్తంగా 56 సీఎఫ్‌సీ కేంద్రాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా అప్పటి తాలుకా కేంద్రమైన వాంకిడిలో రూ.తొమ్మిది వేల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సాయం అందుకోకున్నా కార్మికులు వారు తయారుచేసిన ఫర్నీచర్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతోనే నడిపిస్తున్నారు. 1980లో దీనిని ఐటీడీఏ ఆదీనంలోకి తీసుకుంది. నిరుద్యోగ గిరిజన యువకులకు ఫర్నీచర్ తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో 1987-88 సంవత్సరంలో ఐటీడీఏ అధికారులు రూ.నాలుగు లక్షలతో షెడ్లను నిర్మించారు. కాలక్రమేనా పంట కొరత ఏర్పడడంతో 1993-94 సంవత్సరంలో మెటల్ వర్క్‌ను సైతం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని గమనించిన అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ సుకుమార్ ప్రహారిగోడ, షెడ్ల నిర్మాణానికి రూ.14 లక్షల విలువ చేసే యంత్ర సామగ్రిని సమకూర్చారు. దాదాపుగా 60 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది.

రోజువారీ నిర్వహణకు సహకారం కరువు..!

కనీస సౌకర్యాలు కల్పించబడినా రోజువారీ నిర్వహణకు తగిన సహకారం లభించలేదు. కలప, మెటల్ ఫర్నీచర్ కోసం ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వడంలేదు. కనీసం నిర్ణయించే ధరకు కూడా కలప సరఫరా చేయడంలేదు. ప్రయివేటు వ్యాపారం మాదిరిగానే వేలంలో పాల్గొని కలప కొనుగోలు చేయాల్సి వస్తుంది. బహిరంగ వేలం ద్వారా ఎక్కువ ధర చెల్లించడంతో ఫర్నీచర్‌కు కూడా ఎక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దీంతో ఫర్నీచర్ సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. నాణ్యత, కళాత్మకంగా తయారయ్యే ఈ ఫర్నీచర్‌కు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. అప్పట్లో ఇక్కడ తయారుచేసిన ఫర్నీచర్‌ను రంపచోడవరం, భద్రాచలం, పాలేరు ఐటీడీఏ కొనుగోలు చేశారంటే ఆ పని తనాన్ని అంచనా వేయవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థ అయి ఉండి ప్రయివేటు వ్యాపారాలతో పోటీపడి కలప వేలంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వమే సబ్సిడీపై నేరుగా కలపను సరఫరా చేస్తే సౌకర్యంగా ఉంటుందని కళా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి..!

రాష్ట్రంలో, జిల్లాలో కానీ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమయ్యే ఫర్నీచర్‌ను ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్రమంగా ప్రభుత్వ ఆర్డర్లు తగ్గుముఖం పట్టడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పని లేక ఇతర వృత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందులో ప్రొడక్షన్ ఓరియంట్ బేసిక్‌పైనే కార్మికులు ఫర్నీచర్ అమ్మగా వచ్చే లాభం నుండి జీతాలు తీసుకొని సీఎఫ్‌సీని కాపాడుతున్నారు. వాంకిడి సీఎఫ్‌సీ ఇంకా పనిచేయడానికి కార్మికుల శక్తి ఫలితమేననే అభిప్రాయాలు ఉన్నాయి. మండలంలో చాలామంది నిరుద్యోగులు గిరిజన, గిరిజనేతరులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉంటున్నారు. చట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు లేవు. ఈ సీఎఫ్‌సీని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని ఇక్కడ మండలంలోని నిరుద్యోగ యువతి, యువకులు ప్రత్యేకమైన శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి శిక్షణ ఇచ్చినట్టయితే వారికి ఉపాధి లభించడంతో పాటు ఈ కేంద్రం మరింత అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ ఆర్డర్ లేక కరువైన ఉపాధి...

ఆర్డర్ లేకపోవడంతో తిరిగి పరిశ్రమ మూతపడింది. అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ రూ.4.50 లక్షలు బేంచీలు తయారుచేసేందుకు ఆర్డర్ ఇవ్వడంతో కొన్ని నెలల పాటు పరిశ్రమ కొనసాగింది. తర్వాత ఆర్డర్ లేక తిరిగి మూతపడింది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ ఆర్డర్ లేక వెళవెళబోతుంది. గతేడాది పరిశ్రమ మూతపడి ఉండగా అప్పటి ఐటీడీఏ పీఓగా పనిచేసిన వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చాహత్ వాజ్‌పేయి సీఎఫ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.మూడు లక్షల విలువ చేసే కలప తయారీకి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచుకుంది. అనంతరం బెంగుళూరుకు చెందిన బీఎల్(భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్) కంపెనీకి చెందిన రూ.34 లక్షలు విలువ చేసే 500 డ్యూయల్ డెస్కులు ఆర్డర్ రావడంతో తిరిగి పరిశ్రమ గాడిన పడింది. అనంతరం చిన్నచిన్న ఆర్డర్‌లు రావడంతో గతేడాది అక్టోబర్ వరకు పనులు కొనసాగాయి. ప్రస్తుతం ఆర్డర్ లేకపోవడంతో గతేడాది నుండి కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సీఎఫ్‌సీని జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి దీనిని అభివృద్ధి చేసినట్టయితే యువతకు, మండలంలోని నిరుపేదలకు ఎంతో ఉపాధి కల్పించడం జరుగుతుంది. ఇందులో అనేక శిక్షణలు కూడా గతంలో ఇవ్వడం జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆర్డర్ ఇచ్చినట్టయితే ఈ సీఎఫ్‌సీకి పునర్ వైభవం వస్తుందని మండలవాసులు, పనిచేసే కార్మికులు కోరుతున్నారు.

ఫర్నీచర్ తయారీలో కార్మికులు దిట్ట..

అప్పట్లో ఈ సీఎఫ్‌సీలో ఫర్నీచర్ తయారీలో పనిచేసే కార్మికులు దిట్ట. ఇందులో కలపతో తయారుచేసిన అందమైన వస్తువులు తయారుచేయడంలో ఇక్కడి కార్మికుల ప్రతిభ అమోఘం. భవనాలకు అమర్చే తలుపులు, కిటికీలు, టేబుళ్లు, సోఫాసెట్లు, రాజుల చేర్లు, డైనింగ్ టేబుల్స్, డ్రెస్సింగ్ టేబుల్స్ తదితర వస్తువులను తయారుచేస్తారు. వీటి రూపకల్పనలో కార్మికులు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. ఈ కలపతో ఫర్నీచరే కాకుండా ఇనుముతో బీరువాలు, షెడ్లు, డ్యూయల్ డెస్కులు తదితర వస్తువులు తయారుచేస్తుంటారు. ప్రస్తుతం కలప దొరకకపోవడంతో ఇనుముతోనే వస్తువులు తయారుచేస్తుండేవారు. ప్రస్తుతం పనులు లేక ఖాళీగా ఉంటున్నారు.



ప్రభుత్వ ఆర్డర్ లేకనే ఇబ్బంది పడుతున్నాం

మడావి పైకాజీ, పర్యవేక్షకుడు

సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్ లేకపోవడంతో ఇందులో పనిచేస్తున్న కార్మికులు ఇబ్బందికి గురికావాల్సి వస్తుంది. గతంలో ప్రభుత్వ శాఖకు సంబంధించిన ఫర్నీచర్ ఆర్డర్ వచ్చేది. దీంతో ఈ సీఎఫ్‌సీలో పనిచేస్తున్న దాదాపు 60 మంది కార్మికులు ఉపాధి కలిగేది. గతేడాది వరకు అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు రావడంతో పనులు కొనసాగాయి. ప్రస్తుతం ఆర్డర్ లేకపోవడంతో పనులు లేక ఈ సీఎఫ్‌సీ మూతపడింది. సీఎఫ్‌సీకి ప్రభుత్వం ఆర్డర్ ఇవ్వాలి.



సీఎఫ్‌సీపై ప్రత్యేక దృష్టిసారించాలి

అశోక్, కార్మికుడు

పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడి కొనసాగుతుంది. ఆర్డర్ ఉన్న సమయంలో కార్మికులకు ఉపాధి దొరుకుతూ పనులు లేని సమయంలో కార్మికులకు ఉపాధి ఉండడంలేదు. ఈ పరిశ్రమపై ఆధారపడిన తమకు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు ఈ పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆర్డర్‌లు అందించి కార్మికులను ఆదుకోవాలిం.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని చిర్రకుంట జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మండల విద్యాధికారి సుభాష్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై 60 సంవత్సరాల పూర్తయిన నేపథ్యంలో ఎంతోమంది గొప్పవాళ్ళను సమాజానికి ఇచ్చిందన్నారు. తాము కూడా పాఠశాలలో చదువుకున్నామని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఇటీవలే నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అలాగే పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో పాఠశాల హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెస్ట్ మోటివేటర్ అవార్డు అందుకున్న అశోక్

నవతెలంగాణ-వాంకిడి



జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని దళిత గ్రామాల్లో అంబేద్కర్, బుద్ధుడి ఆశయాలను ప్రచారం చేయడంలో చురుకైన పాత్ర పోషించినందుకు భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ బెస్ట్ మోటివేటర్ అవార్డును అందుకున్నట్టు బీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు చంద్రబోధి పాటిల్ తెలిపారు. ఈ నెల 22న భూటాన్ దేశంలోని తోషియిడ్ వాంగ్ ఫైవ్‌స్టార్ హోటల్‌లో భారతీయ బౌద్ధ మహాసభ, అంతర్ జాతీయ అసోసియేషన్ ఆఫ్ బుద్ధిష్ట్ టూర్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బుద్ధిష్ట్ కాన్ఫరెన్స్, ఇంటర్ నేషనల్ డే ఆఫ్ హ్యాపీనెస్ కార్యక్రమానికి హాజరైన మాజీ యూజీసీ చైర్మన్ ఎస్‌కె తొరాడ్, భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ అధ్యక్షుడు చంద్రబోధి పాటిల్, ప్రొఫెసర్ రిక్క, అబ్టో ఇంటర్ నేషనల్ చైర్మన్ లక్ష్మయ్య ప్రొఫెసర్ కుంజన్ చేతులమీదుగా ఈ అవార్డును ప్రధానం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ప్రపంచ శాంతి దూత బుద్ధ జ్ఞాన మార్గాన్ని, సమానత్వ సమాజం కోసం ప్రచారం చేస్తానని అన్నారు. జిల్లా ప్రజలు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ అవార్డుకు ఎంపిక చేసిన భారతీయ బౌద్ధ మమహాసభ జాతీయ అధ్యక్షుడు చంద్రబోధి పాటిల్, ప్రధాన మనోజ్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ పరంధాములకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పోరుగడ్డపై జాతీయ పురస్కార వేడుక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలచిన ఆసిఫాబాద్ గడ్డపై జాతీయ పురస్కార అవార్డుల వేడుకను నిర్వహించడం జరుగుతుందని సినీ దర్శక నిర్మాత నాగబాల సురేష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవ జ్యోతి సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిందని, సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న డైలాగ్ కింగ్ సాయికుమార్ సినీ జీవితం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుమురం భీం జాతీయ పురస్కార కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఆదివారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయి తేజ ఆర్ట్స్, నవ జ్యోతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాయికుమార్ హాజరవడంతో పాటు మాజీ ఐఏఎస్ పార్థసారథి, హాస్యనటులు బాబు మోహన్, శివారెడ్డి, నిర్మాతలు రాహుల్ యాదవ్, విజయ్ కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం తీసుకురావాలనేదే ప్రధాన ఉద్దేశంతో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. భీం వరసత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ఇందుదకు యువత చైతన్యవంతులు కావాలన్నారు. గిరిజనులను విభజించే కుట్ర జరుగుతుందని గిరిజనులంతా ఐక్యతగా ముందుకు సాగుతూ సంస్కృతి ,సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఎంతో చరిత్ర గల అంకుమ రాజు సమాధి గల ఆలయం ఎందుకు అభివృద్ధి జరగడంలేదని ఆవేదన వెళ్లగక్కారు. అవార్డు ప్రధానం సందర్భంగా 200 మంది కళాకారులతో వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కళామ్మతల్లి సాక్షిగా జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల సభ్యులు సిడాం అర్జున్ మాస్టర్, ధర్మపురి వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, అనుమాండ్ల మధు, చంద్రశేఖర్, రాధాకృష్ణ, బాపూరావు పాల్గొన్నారు.

నేడు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్, జైభారత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ జై భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి వంద సంవత్సరాలు పూర్తి కావడం, రాజ్యాంగాన్ని రచించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంలో పది సంవత్సరాల బీజేపీ పాలనలో రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని పదేపదే మాట్లాడుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న రాజ్యాంగ మార్పు బావనను ఖండించడంతో పాటు దాని అవసరాన్ని ప్రజలకు తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నేడు నిర్వహించే ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్ కుమార్ హాజరుకానున్నారని, కోఆర్డినేటర్‌గా బీసీ జనరల్ సెక్రెటరీ దుర్గం భాస్కర్ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ శ్యామ్, మండల అధ్యక్షుడు చరణ్, జిల్లా నాయకులు ఖలీం, పాల్గొన్నారు.

భగీరథతో శుద్ధమైన తాగునీటిని అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



భగీరథ నల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండలంలోని తుంపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి జరుగుతున్న నీటి సరఫరా ప్రక్రియను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటికి నీరు అందుతున్న సమయం, రోజు వివరాలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా పథకం సంబంధిత పైప్ లైన్లు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించే విధంగా మిషన్ భగీరథ పథకం ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి నమూనాను పరిశీలించి పథకం ద్వారా ప్రతి గ్రామానికి శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా బావులు, బోరు బావులలో నీరు అడుగంటి పోయే అవకాశం ఉన్నందున ప్రజలు మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవాలని, పథకం ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఎలాంటి అపోహలు, ఇబ్బందులు లేకుండా నీటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బావులు, బోరుబావులలో నీరు ఇంకితే ట్యాంకర్లు, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని ఓహెచ్‌ఆర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, గ్రామంలో ఎవరైనా మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి దేవిక పాల్గొన్నారు.

బోర్లు, పాత పోడు భూముల జోలికి రావద్దు

- మాజీ ఎమ్మెల్యే కొనప్ప

నవతెలంగాణ-బెజ్జూర్

తాగునీటి కోసం ఏర్పాటు చేసుకుని బోర్లను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని పాపన్నపేట, కౌటాల మండలంలోని గంగాపూర్ గ్రామాల్లో గ్రామస్తులు మంచినీటి కోసం ఇంటి సమీపంలో బోర్లు వేస్తే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో అటవీ, పోలీస్ అధికారులతో మంచినీటి బోర్లు, పాతప్పుడు భూముల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్నపేట, కర్జ వెల్లి, దింద, గంగాపూర్ గ్రామాల్లో రైతులు ఇండ్లలో బోర్లు వేస్తే అడ్డుకోవద్దని సూచించారు. గ్రామాల్లో 2014 ముందు కాస్తు చేస్తున్న పోడు భూములుసాగు చేసుకుంటున్న పోడు భూముల రైతులను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, పాతపోడు జోలికి రావద్దని సూచించారు. రైతులు సామరస్యంగా వ్యవసాయం చేసుకునేలా సమస్యను పరిష్కరించాలన్నారు. మంచినీరు, పోడు సమస్యలపై అటవీశాఖ అధికారులు అడ్డుకుంటే చూస్తూ, ఊరుకునేది లేదని, అవసరమైతే సమస్యలు పరిష్కరించక పోతే వచ్చేనెల ఐదున మండల కేంద్రంలో రైతులు, రైతు కూలీలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. మంచినీరు బోర్ల విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తే ఊరుకునేది లేదన్నారు. వేసవి కాలంలో రైతులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం ఏంటి అని ప్రశ్నించారు. బెజ్జూరు మండలం బండలగుడ గ్రామంలో గోబర్ గ్యాస్ ప్లాంటును రైతులు ఏర్పాటు చేసుకుంటే అడ్డుకుంటున్నారని తెలిపారు. బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ పని చేస్తామన్నారు. అనంతరం మంచినీటి సమస్య, పోడు సమస్యల పరిష్కారం కోసం రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్పీ రామానుజన్, సీఐలు కే.శ్రీనివాసరావు, ముత్యం రమేష్, పల్నాటి ప్రసాద్ రావు, ఖర్జల్లె ఎఫ్‌ఆర్‌ఓ ఇక్బాల్, బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

అధికారులు సానుకూలంగా స్పందించారు

అనంతరం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులను కలిగిస్తే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. పోడు సమస్య కొంతకాలంగా కొనసాగుతుందని దీనికి గత ప్రభుత్వం కొంతమేర ఫులిస్టాప్ పెట్టిందన్నారు. 2014 సంవత్సరం ముందు పోడు చేసిన రైతులకు గత ప్రభుత్వం ఎస్టీ వారికి పట్టాలు ఇచ్చిందని ఇతర కులస్తులకు వ్యవసాయానికి ఆటంకం కలిగించకుండా అటవీ శాఖ అధికారులు చూడాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బజరత్ ఖాన్, డోకి వెంకన్న, ఇంజీరి రాజారాం, అమిరుద్దీన్, శేఖర్, శ్రీనివాస్, పుల్లూరి సతీష్ పాల్గొన్నారు.



రావి శ్రీనివాస్‌కు ఆదివాసీ నాయకుల మాస్ వార్నింగ్

- రాష్ట్ర కమిటీ ద్వారా షోకాజ్ నోటీసుల జారీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మంత్రి సీతక్కను కించపరిచేలా మాట్లాడడంపై తీరు మార్చుకోకుంటే ఆదివాసుల బలం చూపెడతామని తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయనకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో ఆదివాసి సంఘం నాయకులు పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో అనుభవస్తురాలని అటువంటి వ్యక్తిని కించపరచడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ సమాజం మొత్తం రావి శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అగ్రవర్ణాల అహంకారంతో శ్రీనివాస్ వ్యవహరించడం సరైనది కాదని హెచ్చరించారు. మంత్రికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఒకవేళ అలా చెప్పకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆదివాసీ సమాజం మొత్తం మంత్రికి అండగా ఉంటుందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి కనీసం డిపాజిట్ కూడా రాని వ్యక్తి ఓటమి ఎరుగని ఆదివాసీ మహిళను కించపరిచేలా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి కోసం శ్రీనివాస్ చేసింది శూన్యమన్నారు. వెంటనే స్పందించి క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చేల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఆదివాసీ సంఘాల నాయకులు మూకుమ్మడిగా రావి శ్రీనివాస్ వ్యాఖ్యలు ఖండించారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకునే వరకు అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, జిల్లా యూత్ అధ్యక్షుడు గుండ శ్యామ్, పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, జిల్లా నాయకులు వసంతరావు, సుధాకర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేశ్, బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ పాల్గొన్నారు.

రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్

సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మంత్రిపై చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చ్చార్జిపై పూర్తిస్థాయి క్రమశిక్షణ చర్యలు తీసుకునే వరకు అధిష్టానంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. చర్యలు తీసుకునేంత వరకు కృషి చేస్తామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

విద్యార్థులను అభినంధించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మంచిర్యాల


జిజ్ఞాసకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అభినందించారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కంప్యూటర్ విభాగం విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలలో పాల్గొని డిజిటల్ రంగంలో తెలుగు భాష అభివృద్ధి అధ్యయనం అనే అంశంపై పరిశోధనకు ఎంపికైన నేపథ్యంలో పలువురు విద్యార్థులను అభినందించారు. అదే విధంగా రాష్ట్రస్థాయిలో సెకండ్ ప్రైజ్ మనీకి ఎంపికైన అగర్గూడ మండలం పెంచికల్‌పేట్‌కు చెందిన ఆలం రాజశేఖర్, సునప్ ఆలం, శకరంను అభినందించి మరింత రాణించాలని ఆకాంక్షించారు.



సాగు నీటి సమస్యను పరిష్కరించండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ నియోజకవర్గంలో సాగు నీటి సమస్యతో యాసంగి పంటలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి 2 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేయాలని సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గోదావరి తీర ప్రాంతాల్లో పంటలు సాగు చేసిన రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొవడమే కాకుండా పంట నష్టం అవుతుందని అన్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి ఎల్లంపల్లిలో 8 టీఎంసీల నిరు నిలువ ఉండగా ఈ ఏడాది 12 టీఎంసీల నీరు ఉందని తెలిపారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

- ఆర్‌జేడీ కాటేపల్లి సత్యనారాయణరెడ్డి



నవతెలంగాణ-జన్నారం

విద్యతోనే వ్యక్తికి సమాజంలో గౌరవం లభిస్తుందని వరంగల్ ఆర్‌జేడీ కాటేపల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులను పరిశీలించి ఎస్సె టు పరీక్షల నిమిత్తం ప్రణాళిక బద్ధంగా చదివి పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించగలరని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం యూనిఫాంలో ఉండడం చూసి అభినందించారు. ఉపాధ్యాయులు కూడా యూనిఫాంలో ఉండడం వలన విద్యార్థులలో కూడా యూనిఫాం ధరించాలని ఆలోచన పెరిగి ఐక్యత భావం పెంపొందుతుందని అన్నారు. కలమడుగు పాఠశాల చాలా చక్కగా నడుస్తుందని కొనియాడారు. రాబోయే పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి ప్రణాళిక బద్ధంగా విద్యాబోధన జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి డీసీఈబీ సహాయ కార్యదర్శి కుమార్ మురిమడుగు పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ అనుముల రాజన్న ఉపాధ్యాయ లు విద్యార్థులు పాల్గొన్నారు.

దోషులకు శిక్ష పడేలా వ్యవహరించాలి

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ

నవతెలంగాణ-జైపూర్

నేరస్థులకు శిక్ష పడితే నేరాలు తగ్గుతాయని, బాధితులకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమీసనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో శనివారం కమీషనరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడేవిధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సీపీ సూచించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా మానవత్వంతో మెదలాలని, దోషులకు శిక్ష పడటంలో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమని తెలిపారు. నేరస్థులకు వారెంట్స్, సమన్లు సత్వరమే ఎగ్జిక్యూట్ అయ్యే విదంగా చర్యలు చేపట్టాలని ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌కు తెలియజేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు వారెంట్లు, సమన్లు సీసీటీఎస్ఎస్ డాటా ఎంట్రీ చేయాలని తెలిపిన ఆయన బాధితులకు న్యాయం జరిగితే పోలీసులపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. లోక్ అదాల్ కేసుల్లో ప్రతిభ చూపిన కోర్టు డ్యూటీ ఆఫీసర్స్‌కు సీపీ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, లీగల్ సెల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, సీసీఆర్‌బీసీ ఇన్స్‌పెక్టర్ సతీష్, ఐటీ సెల్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, సీసీ హరీష్ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లక్షెటిపేట

కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రంజాన్ కానుకలను శనివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పంపిణీ చేశారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం సోదరులకు రంజాన్‌తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం రంజాన్ పండుగకు తోఫా ఇస్తున్నామని గుర్తు చేశారు. పవిత్ర మాసం సందర్భంగా ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లీం సోదరిమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్ పాల్గొన్నారు.

అసంఘటీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

అసంఘటీత కార్మికులైన బీడీ, బిల్డింగ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాకు వెళ్తున్న రాష్ట్ర సీఐటీయూ నాయకులను అరెస్టును నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అసంఘటీత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీస వేతనలు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అసంఘటీత కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదని, ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్ పోశం, మహేష్, రాములు, రజిత, సత్తన్న పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని బస్టాండ్ నుంచి జీఎం కార్యాలయం మూల మలుపు వరకు ప్రమాదాలను నివారించేందుకు శనివారం సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో, సాయంత్రం వేళలో రద్దీ సమయాల్లో వాహనదారులు మూల మలుపు వద్ద ప్రమాదాలకు గురవుతున్నారని గమనించి సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే నిత్యం రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని, కాబట్టి ప్రజలు కూడా రోడ్డు మీద వాహనాలు నడిపే సమయాల్లో జాగ్రత్తలు పాటించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించి వాహనం నడపడం, సెల్ ఫోన్ వాడకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగంగా డ్రైవింగ్ చేయకుండా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు మీద వాహనాలు నడిపే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకి సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ ఉన్నారు.

మంత్రి మండలి సభ్యులకు పాలాభిషేకం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిపై బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకై అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా ఐఎన్టీయూసీ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి వర్గానికి పాలాభిషేకం చేశారు. గని అసిస్టెంట్ పిట్ సెక్రటరీ చింతం రవికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య హాజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడోయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడతామని ఇచ్చిన మాట ప్రకారంగా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ కులగణన, సమగ్ర కులగణన జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలకు ఆరాధ్య దైవంగా మారారన్నారు. ఈ నిర్ణయంతో బీసీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో విశేషమైన అవకాశాలు వస్తాయన్నారు. ఎస్సీ వర్గీకరణకై దళిత సోదరులు చేస్తున్న పోరాటాలను నిజం చేస్తూ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి దళితుల ఆశాజ్యోతిగా రేవంత్‌రెడ్డి అయ్యారన్నారు. అనంతరం వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య మాట్లాడుతూ మా నాయకుడు జనక్ ప్రసాద్ కార్మిక పక్షపాతి అని సింగరేణి కాపాడుకోవడానికి అహర్నిశలు కషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ మెంబెర్స్ వెంకటస్వామి, బన్న లక్ష్మణ్ దాస్, గని సీనియర్ నాయకులు చింతం సత్తయ్య, గొల్ల రాజేందర్, రాంటింకి మల్లేష్, ముక్కెర కుమార్, కండె నవీన్, గణపతి అంజి, యువ నాయకులు ఆవునూరి రవి, గెల్లి మనోహర్, రెమ్మ నిశాంత్ పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం నిర్ణయించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

అసెంబ్లీ సమావేశాల్లో వీఓఏలకు కనీస వేతనం నిర్ణయించడంతో పాటు ప్రభుత్వం ఎన్నికల ముందు వీఓఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వీఓఏ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాల్‌లో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం గడిచిన ఐకేపీ, వీఓఏల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయని వీఓఏలకు ఇచ్చే వేతనం ఎటూ సరిపోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం విఓఏలకు రూ.20,000 వేతనం, ప్రతినెలా వ్యక్తిగత ఖాతాలలో జమచేయాలని అన్నారు. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ ఇన్సెంటివ్ గ్రామ సంఘాలకు ఇవ్వాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, జిల్లా కోశాధికారి పొట్ట పోశం, రజిత, మహేష్, తుకారాం, సమ్మన్న, మల్లేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గురునాతమ్ శంకర్‌గౌడ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబురావు తెలిపారు. గత నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలోని జర్చర్లలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు నాయకత్వం వహించి ప్రతిభ కనభరిచాడు. ఈ మేరకు ఏప్రిల్ 16 నుంచి 19వ తేదీ వరకు మణిపూర్‌లో జరగనున్న 68వ జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, సిబ్బంది, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, డీఐఈఓ అభినందించారు. మణిపూర్‌కు సరైన రైలు సౌకర్యం లేకపోవడంతో రాష్ట్ర జట్టును విమానంలో పంపించనున్నట్లు ఈ ఖర్చుల కోసం పలువురు ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు.

అమరులను స్మరించుకుందాం

- పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సికిందర్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పరాయి పాలనను ఎదిరిస్తూ దేశ స్వాతంత్ర్యం, సమానత్వం కోసం ఉరి తాడును ముద్దాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులను స్మరించుకుందామని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సికిందర్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల 94వ వర్ధంతి సభలకు సంబంధించిన పోస్టర్లు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతీ గృహంలో శనివారం విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలలో వర్ధంతి సభలు, కాగడాల ప్రదర్శన చేపట్టాలని యువకులకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల మధ్య కుల మతాల పేరుతో మంటలు రాజేస్తూ దేశాన్ని విచ్చిన్నం చేసి అశాంతిని నెలకొల్పేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలో మతం పేరుతో మంటలు పెట్టి రాష్ట్రాన్ని రావనకాష్టంగా మార్చి వేసిందని విమ్మర్శించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి దేశల ఆధిపత్య పోరాటంలో భాగంగా మూడవ ప్రపంచ యుద్ధం వచ్చే సూచనలు ఉన్నాయని కొత్తగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత నిరుద్యోగ యువతని లక్ష్యంగా చేసుకుని సంకెళ్ల వేసి దేశానికి తీసుకొచ్చి వదిలేస్తుంటే భారత ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నాడో యవతరం ఆలోచనలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచరణ్, సంపత్, రోహిత్, రాంచరణ్, నందకిశోర్, రిత్విక్, లింగేష్, అభిరామ్, అఖిల్ పాల్గొన్నారు.

పరీక్షా సమయంలో ఇతరులకు అనుమతి లేదు



నవతెలంగాణ-జైపూర్

10వ తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల్లోకి ఎవ్వరికి అనుమతి ఉండదని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి శనివారం మండల కేంద్రంలోని పరిక్షా కేంద్రాన్ని సంధర్శించారు. పరిక్షల నిర్వాహణ, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. 251 మంది విద్యార్థులకు 251 మంది పరిక్షలకు హాజరైనట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా ఇందారం పరీక్షా కేంద్రానికి సంబంధించి 102 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరు కావల్సివుండగా 97 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరైనట్లు తెలిపారు. మండల పరిధిలో మొత్తంగా 353 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరు కావల్సివుండగా 348 మంది మాత్రమే పరిక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

సజావుగా పదవ తరగతి పరీక్షలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా సాగుతున్నాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గర్మిళ్ళ, గర్ల్స్ హై స్కూల్, ట్రినిటీ పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఈఓ ఎస్.యాదయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్‌టీసీ బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుధ్యం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరిచారు. రెండవ రోజు 9 వేల 185 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 163 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణరెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రశ్నాపత్రాల స్టోరేజ్ పాయింట్‌ను సందర్శించి ప్రశ్నాపత్రాల పంపిణీ విధానాన్ని పరిశీలించిన అనంతరం మంచిర్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, హాజీపూర్‌లో 1, లక్షెట్టిపేటలో 2, దండేపల్లిలో 2, జన్నారంలో 1 పరీక్షా కేంద్రాలను సందర్శించారని తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బొగ్గు ఉత్పత్తిని త్వరగా రవాణా చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న భూగర్భ ఉపరితల గనుల్లో ఉత్పత్తి చేసిన బొగ్గును వీలైనంత త్వరగా రవాణ చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో బొగ్గు రవాణా, ఇసుక, బాటమ్ యాష్ రవాణాకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నిర్ణీత సమయంలో బొగ్గు రవాణా చేసి వినియోగదారులకు సరైన సమయంలో బొగ్గు సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, స్టోవింగ్ మెటీరియల్ నిల్వలు, స్టోవింగ్ మెటీరియల్ సప్లై వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రణాళికలు వేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం కె రాజేందర్, ఎస్ఆర్పి 1,3 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏరియా సర్వే అధికారి నర్సింగ్‌రావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పట్ల సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టు పెట్టిన బ్యాగరి వెంకటస్వామి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు శీలం వెంకటేశం, పండుగ రాజన్న కోరారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ శ్రీధర్‌ను కలిసి శనివారం పిర్యాదు చేసిన ఆయన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని దూశిస్తూ వాట్సాఫ్‌లో పోస్టు పెట్టిన వెంకటస్వామిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ నెల 19న జరిగిన ఈ సంఘటనలో బ్యాగరి వెంకటస్వామి అనే వ్యక్తి ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందుతుంటే ఎక్కడ చచ్చావని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని దూసించినట్లు తెలిపారు. మంత్రి పదవి కొసం సభలు ఏర్పాటు చేసి కోట్లు ఖర్చు చేసిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందుతుంటే ఎక్కడున్నావని ప్రశ్నిస్తూ ఎమ్మెల్యేను కించపర్చుతూ పోస్టు పెట్టాడని పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పోతన్న శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలపిన వివరాల ప్రకారం పోతన్న ఉదయం గ్రామంలో ప్రజలకు వైద్య సేవలు అందించి తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో కుటుంబ సభ్యులు తన కుమారుడి వివాహం కోసం నూతన వస్త్రాలు కొనుగోళ్లు చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. దీంతో ఆయన ఒక్కరే ఇంటి వద్ద ఉన్నారు. ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. అదే క్రమంలో పోతన్న తల్లి కుమారుడి కోసం భోజనం తీసుకువచ్చి చూసే సరికి కుర్చీలో ఉన్న పోతన్న కింద పడిపోవడంతో చుట్టూ ప్రక్కల వారికి తెల్పడంతో వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.రాధిక చలివేంద్రని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతంలో నుంచి వచ్చే వారికి వేసవి తాపం నుంచి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి జనాలు రద్దీగా ఉండే చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.అంజు కుమార్ రెడ్డి, ప్యానల్ లాయర్లు, డిఫెన్స్ కౌన్సిల్ పాల్గొన్నారు.

ముగిసిన వార, మేకల సంత వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోగల వారసంత మేకల సంత దినసంతకు శనివారం రెండోసారి డీఎల్పీఓ ఉమర్ హుస్సేన్, పంచాయతీ సెక్రెటరీ కిరణ్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వారసంతను ఆత్రం వెంకటేష్ రూ.3లక్షల 50 వేలకు సొంతం చేసుకోగా, మేకల సంతను కనకం మోతీరం రూ.8 లక్షలు వెయ్యికి సొంతం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు రాకుండా సంత నిర్వహణ చేపట్టాలని సూచించారు.

దినసంత వేలం మరోసారి వాయిదా

ఇప్పటికే ఈ నెల 18న వేలంపాటలు నిర్వహించాల్సి ఉండగా నిర్దేశించిన సొమ్ము రాలేదని వాటిని రద్దు చేసిన అధికారులు శనివారం నిర్వహించిన వేలంపాటలో దిన సంత వేలం ప్రభుత్వం నిర్ణయించిన అప్సెట్ వేలం ధర రానందున మళ్లి వాయిదా వేశారు. వేలం పాట తేదీని త్వరలో ప్రకటిస్తామని పంచాయతీ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

తహసీల్దార్ నూతన భవనానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-కుభీర్



మండల కేంద్రంలో తహసీల్దార్ నూతన భవనానికి ఎస్‌డీఎఫ్ కింద రూ. 50 లక్షల నిదులు మంజూరైనట్టు బీజేపీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాద్రి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల కాలం నుండి మండల ప్రజలకు సేవాలాందించేందుకు తహసీల్దార్ భవనం లేక అధికారులు, మండల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ కొన్ని రోజుల క్రితం మండల కేంద్రానికి ఓ సమావేశానికి హాజరైన సందర్భంలో తెలిపారన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి భవనం లేక బీసీ వసతి గృహంలో కొనసాగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారన్నారు. దీంతో శనివారం తహసీల్దార్ నూతన భవనానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.50లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎమ్మెల్యేకు మండల ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగా శేఖర్, లింబాద్రి, కనకయ్య ఉన్నారు.

అర్ధ మండల దీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆంజనేయస్వామి అర్ధ మండల దీక్షలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో శేఖర్ శర్మ శ్రీనివాస్ శర్మ స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులతో మాలధారణ చేయించారు. దీక్షల నియమ నిబంధనలను వివరించారు. సుమారు 150 మంది భక్తులు దీక్షలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కమిటీ ప్రముఖులు పిన్న వివేక్, ఎకరాల శ్రీనివాస్, డా.మధు, సుధాకర్, డాక్టర్ రమేష్, నారాయణమూర్తి, లక్ష్మణ మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రానికి చెందిన కావిడే అనూష బేస్ బాల్ క్రీడాకారిణికి ఇంపాక్ట్ క్లబ్ సభ్యులు శనివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లి రావడానికి ఆర్థిక సాయం అందజేసినట్లు ఈ సందర్భంగా ఇంపాక్ట్ క్లబ్ జిల్లా అధ్యక్షురాలు చెంచులక్ష్మి తెలిపారు. దాతల సహకారంతో ఆమెకు ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెస్‌బాల్ క్రీడను జాతీయస్థాయిలో తీసుకెళ్తున్న అనూషకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విష్ణువర్ధన్, మౌనిక, దుర్గా, సుజాత పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ దింద, కేతిని, కోయపల్లి, అడేపల్లి ఆయా గ్రామాలలోని పేద పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పోడు పేద రైతులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. రెండు తరాల నుండి చేసుకుంటున్న భూములకు అడ్డుపడడం సరికాదన్నారు. ఎన్నికల ముందు పోడు భూములకు పట్టాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పి ఇప్పుడు మాట తప్పిందని ఆరోపించారు. సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, దేకే రామన్న, కౌటాల మండల అధ్యక్షులు కుంచాలా విజయ్, నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం రామప్ప, లక్నవరం ప్రాంతాలను సందర్శించారు. వృక్ష, జంతు, రసాయన, హిందీ విభాగాల ఆధ్వర్యంలో ఈ పర్యటన కొనసాగింది లక్నవరం పరిసర ప్రాంతాలలో ఉండే అడవుల్లోని వృక్ష సంపద, లక్నవరం రామప్ప చెరువులో పెరుగుతున్న శైవలాలు, నీటి మొక్కల గురించి విద్యార్థులు అధ్యయనం చేశారు. రామప్ప సమీప ప్రాంతాల్లోని జీవ వైవిధ్య ప్రదేశాన్ని, ఆ ప్రాంతంలో పెరుగుతున్న అరుదైన కేస్ మొక్కలను విద్యార్థులు పరిశీలించారు. ఈ మొక్కల తీరు, వాటి ఉపయోగాల గురించి వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీరమల్ల దేవేందర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. నీటిలో పెరుగుతున్న వివిధ జంతు ప్లవకాలు, వివిధ రకాల చేపలు, వాటిని గుర్తించే విధానాల గురించి జంతు శాస్త్ర అధ్యాపకులు వెంకటేశం వివరించారు. రామప్ప గుడి నిర్మాణంలో ఉపయోగించిన నీటిలో తేలియాడే ఇటుకలు, వాటిలో ఉండే రసాయనాలు, నీటిలో తేలుటుకు గల కారణాల గురించి రసాయన శాస్త్ర అధ్యాపకురాలు శారద విద్యార్థులకు వివరించారు. గుడి విశిష్టతను, యునెస్కో గుర్తింపు పొందడానికి కారణాలను హిందీ విభాగాధిపతి దుర్గం జనార్ధన్ వివరించారు. క్షేత్ర పర్యటనలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసింహం అభినందించారు.

ఆప్టోమెట్రిస్టులను ఆదుకునేవారేరి..?

- గత ప్రభుత్వంలో తాత్కాలిక కొలువులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- నేడు ఆప్టోమెట్రిస్ట్ దినోత్సవం



కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్టోమెట్రిస్ట్(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మనిషికి కంటి చూపు అనేది ఎంతో అవసరం. అటువంటి కంటిచూపు ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సలహాలు సూచనలు అందిస్తూ పరీక్షించి కంటి చూపును పరిశోధించే నిపుణులు (ఆప్టోమెట్రిస్టులు) పని దొరకక పడుతున్న ఇబ్బందులపై ప్రపంచ ఆప్తమెట్రిస్ట్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ఇది పరిస్థితి

గతంలో జిల్లాలోని ప్రభుత్వ వైద్య శాఖలో 19 మంది కంటి చూపును పరిశోధించే నిపుణులు పనిచేశారు. ప్రభుత్వం వీరికి ఎటువంటి గ్యారెంటీ ఇవ్వకపోవడం, వేతనాలు సరైన సమయానికి చెల్లించకపోవడం, కుటుంబ పోషణ భారంగా మారడంతో నమ్ముకున్న పనిని వదులుకున్నారు.

గత ప్రభుత్వంలో తాత్కాలిక కొలువులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు కంటిచూపు పరీక్షించే ఉద్దేశంతో వందరోజుల ప్రత్యేక ప్రణాళికతో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో ఆప్తమిస్టుల పాత్ర వెలకట్టలేనిది. ప్రజలకు కంటి పరీక్షలు చేయడంతో పాటు వారికి అవసరమైన మందులు రాయడం కళ్లద్దాలు ఇవ్వడం చేశారు. ఈ ప్రక్రియను ప్రభుత్వం నిరంతరం చేయకుండా కేవలం తాత్కాలికంగా మాత్రమే చేయడంతో వీరి ఇబ్బందులు మరింత రెట్టింపయ్యాయి.

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

గత ప్రభుత్వ హయాంలో అతి తక్కువ వేతనాలతో తాత్కాలికంగా పనిచేసిన తమను ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. గతంలో ఎమ్మెల్యేలకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ప్రభుత్వం వీరిని ప్రభుత్వ ఆస్పత్రులలో నియమిస్తే కొంత ఆర్థిక చేయూత అందే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియమించాలి

ప్రవీణ్ యాదవ్, ఆప్టోమెట్రిస్ట్



గతంలో ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు విజయవంతంలో తాము ఎంతగానో కృషి చేశాం. గతంలో తాము చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రులలో మా సేవలు వినియోగించుకోవాలి. కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిస్తే కొంత మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని కోరుతున్నాం. దృష్టి సారించి ఆదుకోవాలి.

వరుస దొంగతనాలకు పాల్పడ్డ దొంగ అరెస్ట్

- 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్

పట్టణంలోని బాలాజీనగర్‌లో మూడు దొంగతనాలకు పాల్పడ్డ దొంగను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ విలేకరులకు వివరించారు. స్థానిక బాలాజీనగర్‌లో గడిచిన రెండు నెలల వ్యవధిలో మూడు వరుస ధొంగతనాలు జరిగాయి. అదే కాలనీకి చెందిన జంజిరాల ప్రదీప్ ఈ దొంగతనాలకు పాల్పడ్డట్లు సీఐ వివరించారు. ప్రదీప్ తమ సమీప బంధువుల ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితుని నుండి 86.6 గ్రాముల (2.22 లక్షలు) బంగారు ఆభరణాలు, కారు (నెం. టీఎస్03ఎఫ్ఎఫ్3556), ఒక సెల్‌ఫోన్, రూ. 12 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేరనే సామెత ఉందని, కాని ఎటువంటి దొంగలనైనా సీసీ కెమెరా పడుతుందనేదానికి ఇది నిదర్శనమని అన్నారు. సీసీ టీవీ ఫుటేజీ వల్లే ఈ దొంగను పట్టుకోగలిగామని, కాబట్టి పట్టణ ప్రజలు ప్రతీ ఒక్కరు తమ ఇళ్ల ముందు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐలు సుధాకర్, యాదగిరి, సురేష్‌లు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1నుండి ప్రజలకు సన్న బియ్యం



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

ఏప్రిల్ 1నుండి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాలలో సన్నబియ్యం సరఫరా అంశంపై రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులతో శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యాన్ని ఇవ్వొద్దన్నారు. సన్న బియ్యం జారీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. వేసవికాలం ఎండలు అధికంగా ఉన్నందున్న రేషన్ దుకాణాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డిఎం వేణుగోపాల్, డిఎస్‌ఓ కిరణ్ కుమార్, రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహనను కలిగి ఉండాలి

విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహనను కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు జిల్లాలో ప్రత్యేకంగా బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయ పనితీరు, రెవెన్యూ అంశాలు, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా చరిత్ర, రాజ్యాంగం, జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చని తెలిపారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు సమీకృత జిల్లా కార్యాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు సలోమి కరుణ, డాక్టర్ శ్రీనివాస్, కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్ విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 23 నుండి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించే భగత్ సింగ్ 94వ వర్ధంతి వారోత్సవాల పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ భవిష్యత్తును కాపాడుకోవడం కోసం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మరో స్వతంత్ర పోరాటానికి యువతీ, యువకులు, ప్రజలు సిద్ధం కావాలన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ మతోన్మాద ఫాసిస్టు భావజాలాన్ని ప్రతి మనిషిలో చొప్పించడం కోసం బలవంతపు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మతోన్మాద ఫాసిస్టు భావజాలానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రతి మనిషిని అణచివేస్తున్నారన్నారు. అర్బన్ నక్సలిజం పేరుతో అమాయకులైన ఆదివాసులను, గిరిజనులను వందలాది మందిని తమ రక్షణ బలగాల చేత చంపివేస్తున్నారని ఆరోపించారు. ఈ మతోన్మాద ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం, మోడీ, అమిత్ షా ద్వయం సాగిస్తున్న మారణకాండ కు వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో దోపిడీ వ్యవస్థను కూల్చివేయడానికి సిద్ధపడాలని అన్నారు. అదే పోరాట స్ఫూర్తితో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి వారోత్సవాలను ఈ నెల 23 నుండి 30 వరకు గ్రామ గ్రామాన జిల్లా వ్యాప్తంగా సభలు జరపాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అయ్యూబ్ ఖాన్, హాస్టల్ నాయకులు విష్ణు, అఖిల్, బిమేష్, మహేష్, సాయి తేజ, సుశాంత్, వంశీ, గజానంద్, వెంకటేష్, అఖిల్, అవినాష్ పాల్గొన్నారు.

పాఠశాలకు రిఫ్రిజి రేటర్ అందజేత

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అక్షరాస్యతపై అవగహన కల్పించడంతో పాటు ఆర్‌బీఐ నుండి వచ్చిన రిఫ్రిజి రేటర్ అందించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నిర్వాహకులు ఆర్‌బీఐ డీజీఎం టి.జగదీష్, మంచిర్యాల లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి పలు సంస్థల నిర్వహకులు రాజశేఖర్, షాహీన, స్వరూప, రాజేష్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ చారిత్రక నిర్ణయం

నేరడిగొండ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రక నిర్ణయమని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీసీ రిజర్వేషన్, రాజీవ్ యువ వికాసం నిరుద్యోగ పథకం ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, మైనార్టీ సెల్ చైర్మన్ వకీల్, యువజన అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, రవి, బి.రాములు, పాల శంకర్, నారాయణ సింగ్, కమల్ సింగ్, కేవల్ సింగ్, కైలాష్ సెట్, భీంరాజు గౌడ్, రమేష్, కుంట శంకర్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ఆర్థిక వ్యవస్థ నష్టపోదు

తాండూర్ : దేశంలో ఒకేదఫా ఎన్నికలు నిర్వహించడం వల్ల ఆర్థిక వ్యవస్థకు ఏమాత్రం నష్టం జరగదని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ దేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహించుకోవడం వలన ఆర్థిక వ్యవస్థకు నష్టం జరగదని, ఎన్నికల ఖర్చు తక్కువ అవుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు భరత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల ఉపాధ్యక్షులు సిద్ధం మల్లేష్, చోక్కాల నాగభూషణ్,ఆవుల చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఎక్కువ సంఖ్యలో వయోధికులు ఉన్నందున డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు యు నారాయణ, సిహెచ్ రామయ్య, బావండ్లపల్లి నర్సయ్య తదితరులు ఒక ప్రకటనలో కోరారు. వయోధికుల సంరక్షణ కోసం డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నందున ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం

- భారీగా పొగమంటలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇంట్లో ఓ ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని టీచర్స్ కాలానికి చెందిన ఓ వ్యక్తి శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో పార్క్ చేసి స్కూటీకి చార్జింగ్ పెట్టి మర్చిపోయాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో స్కూటీ పేలినట్లు ఒక్కసారిగా సౌండ్ రావడంతో ఇంట్లోవారు చుట్టుపక్కల వారు బయటకు హుటాహుటిన వచ్చి చూశారు. స్కూటీకి మంటలు అంటుకొని కాలిపోతు భారీగా పొగమంటలు వచ్చాయి. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిగా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. స్కూటీ పేలే సమయంలో స్కూటీ దగ్గర ఎవరూ లేకపోవడంతో ప్రాణ హాని తప్పింది.

మున్సిపాలిటీలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మున్సిపాలిటీగా మారిన జిల్లా కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ కేంద్రానికి మారుమూల గ్రామల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో అనేక అవసరాల రీత్యా వస్తారన్నారు. ముఖ్యంగా మహిళలు అధికంగా వస్తున్నారన్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. మున్సిపల్ కేంద్రంగా రెండు చోట్ల జనకాపూర్, ఆసిఫాబాద్ బస్టాండ్ సమీపంలో ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్ స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం, టికానంద్, గొడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం దిమ్మదుర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విజయ్ కుమార్ రెడ్డి నరేష్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణమవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల అధ్యక్షులు బుజంగ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పడాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల లింగారెడ్డి, సుంకరి రత్నయ్య, రమణ పాల్గొన్నారు.

24న వారసంత వేలం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మేజర్ గ్రామపంచాయతీ వారసంత వేలంపాట ఈ నెల 24న గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వారసంత వేలంపాట ఉంటుందని, వేలంలో పాల్గొనే అభ్యర్థులు గ్రామపంచాయతీ పేరు మీద రూ.50 వేల డిపాజిట్ చేయాలని, గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదన్నారు. డిపాజిట్ చేసిన అభ్యర్థులు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. నిర్ణయించిన ధర రాని పక్షంలో రెండో పాట నిర్వహిస్తామన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు 24 గంటల్లోపు 50శాతం నగదు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, మిగతా డబ్బులు జూలై 15వ తేదీలోపు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ధరవత్తు జప్తు చేసి మారల వేలం వేస్తామన్నారు. వారసంత గ్రామపంచాయతీ నిర్ణయించిన ధర మాత్రమే వసూలు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుద్ధ విహార్ నిర్మాణానికి వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బూరుగుడలో బుద్ధ విహార నిర్మాణానికి నిధుల విడుదల చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకి బుద్ధిస్ట్ ఇంటర్‌నేషనల్ నెట్‌వర్క్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూరుగుడ గ్రామంలో బుద్ధ విహార్ నిర్మాణం చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ ఇంటర్‌నేషనల్ నేట్‌వర్క్ జిల్లా నాయకులు డోంగ్రి వాసుదేవ్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు జాడి దిలీప్, ఐక్య భారత వేదిక నాయకులు ప్రవీణ్, బూరుగుడా బుద్ధ విహార నాయకులు వైరాగడే లోహజీ, వైరాగడే ప్రవీణ్, బాంసెఫ్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు, లుంబిని దీక్ష భూమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జికి షోకాజ్ నోటీసు జారీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌కు ఆ పార్టీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పార్టీని అప్రతిష్టపాలు చేయడం, ఆదివాసీ మంత్రి సీతక్కపై వ్యతిరేకంగా మాట్లాడడం లాంటి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఇటీవలే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె విశ్వప్రసాద్‌రావు జి చిన్నారెడ్డికి ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. దీనిని పరిగణలోనికి తీసుకున్న క్రమశిక్షణా సంఘం రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై ఈ నెల 28లోగా వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ నియమాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | మార్చి 23, 2025 | www.navatelangana.com

ఆర్టీసీ డీఎంగా ప్రతిమారెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జి.ప్రతిమారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం



ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన కల్పన జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన డీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఉద్యోగులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్టీసీని లాభాల బాటల్లో నడిపించేందుకు ప్రయాణికులతో చేరువై కృషి చేస్తామని, నూతన డీఎం పేర్కొన్నారు.

కళాశాలలో జల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపల్ డా. అతిక్ బేగం పాల్గొని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఎం నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ పర్యావరణ సమస్యలు దాని నివారణ మార్గాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.ఎస్.నారాయణన్ క్యాన్సర్ సమస్యలు, మనం తాగే నీటి వనరులు, గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.వెంకటేష్, కోటయ్య అనిత, చంద్రకాంత్, గోపాల్, కునాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



డిగ్రీ గెస్ట్ లెక్చరర్లపై అసెంబ్లీలో ప్రస్తావన



నవతెలంగాణ-ఉట్నూర్

గత కొన్ని ఏండ్లుగా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లలో విధులు నిర్వర్తిస్తున్నా గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై శనివారం అసెంబ్లీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రస్తావించినందున ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గెస్ట్ లెక్చరర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంధర్భంగా ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు సోగాల ప్రవీణ్, సయ్యద్ జావిద్ అలీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో డిగ్రీ కాలేజ్‌లో గెస్ట్ లెక్చరర్ల కోసం ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక కావడం జరుగుతుందన్నారు. తమకు 12నెలల వేతనం ఇవ్వడం లేదని రోజు వారి ఆధారంగా వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. తమకు ప్రతి సంవత్సరం ఆటో రెన్యువల్ చేసి, 12నెలల వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలపై నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలసి విన్నవించడం జరిగిందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడాన్ని ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చర్స్ పాల్గొన్నారు.

40శాతం రాయితీతో రైతులకు యంత్ర పరికరాలు

నవతెలంగాణ-నేరడిగొండ

వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద మహిళ రైతులకు సన్న చిన్న కారు రైతులకు 40 శాతం రాయితీపై అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయబడుతుందని ఏఓ కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మహిళ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని, 25వ తేదీలోగా లబ్ధిదారులను ఎంపిక చేసి, యంత్రాలు ఉపకరణాలు అందజేసే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి

నవతెలంగాణ-నిర్మల్

వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో 24 నుంచి ప్రతి సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తమ అర్జీలను సమర్పించేందుకు వీలుగా ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు టెలి ఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే 91005 77132 ఫోన్ నంబర్‌ను సంప్రదించడం ద్వారా నేరుగా తమ సమస్యలను తెలిపి, దరఖాస్తులను వాట్సప్ ద్వారా పంపవచ్చునన్నారు. టెలిఫోన్ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యథావిధిగా సాధారణ ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దూర ప్రాంత ప్రజలు టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

లింగ నిర్ధారణ ప్రక్రియ చట్టరీత్యా నేరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన తెలిపారు. ఈ చట్టాన్ని బలోపేతంగా అమలు చేసే ప్రక్రియకో భాగంగా శనివారం ప్రత్యేక తనిఖీ బృందం జిల్లాలోని రెండు స్కానింగ్ సెంటర్లను సందర్శించి తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వారికి సూచనలు చేశారు. తనిఖీ బృందంలో రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గైనకాలజీ డాక్టర్ క్రాంతి, మిషన్ కోఆర్డినేటర్ యశోద,పోలీసు అధికారి వైష్ణవి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని యాపల్‌గూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భయపడకుండా పరీక్షలు మంచిగా రాయాలన్నారు. పాఠశాలలో మంచినీటి సమస్య మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.

దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని మహవీర్ దాబా (గోపి రాజస్థాన్ దాబా) హోటల్‌లో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని ఎస్సై శ్రీకాంత్‌కు సమాచారం అందడంతో తనిఖీ చేశారు. మద్యం విక్రయిస్తున్నట్లు రుజువు కావడంతో వాటికి సంబంధించిన ఎటువంటి లైసెన్సులు లభించకపోవడం, మద్యం తాగడానికి వ్యక్తులను అనుమతి ఇస్తున్నాడని విచారణలో తెలింది. దీంతో మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, వసతులు వార్షిక ఫలితాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం జీఎం కార్యాలయం చేరుకొని జీఎం విజయభాస్కర్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రెడ్డిమల్లతిరుపతి, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్ల రెడ్డి, బాబునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

దాబాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదు

- జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి
- పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహజన్

నవతెలంగాణ-ఇచ్చోడ

గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ముందుగా పోలీసు సిబ్బంది ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలపై కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలాల పరిధిలో జాతీయ రహదారి ఉన్నందున ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ ఎక్కువగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ, రోడ్డు ఇంజనీరింగ్ తప్పిదం ఉన్న ప్రదేశాలలో సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, జిగ్జాగ్ పద్ధతిని అవలంబిస్తూ ప్రమదాలను అరికట్టాలని తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి మత్తు పదార్థాలను, గంజాయి పండించడం సేవించడం లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల కేంద్రంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తదితకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతూ అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ముందస్తు మీటింగ్‌లు నిర్వహిస్తూ పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. రహదారి దాబాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు మద్యం సేవించడం లాంటి వాటిని ఉపేక్షించకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ గంజాయి వల్ల ప్రభుత్వ పథకాలను నష్టపోతారనే విషయాన్ని తెలియజేస్తూ చైతన్య పరచాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, యువతకు చదువుతూ ఉన్న లబ్ధిపై అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్ల పరిధిలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సిఐ భీమేష్, ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, శివరాం ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి సంస్థ భవిష్యత్తు, కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ మేరకు 27 మంది కార్మికులను ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలు భవిష్యత్తు, కార్మికుల హక్కులు సౌకర్యాల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. 15 సంవత్సరాల నుండి సింగరేణిలో కొత్త గనులు రాకపోవడం వల్ల ఇప్పుడున్న యువత రానున్న రోజులలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. సింగరేణి సంస్థ కోసం గుర్తింపు కార్మిక సంఘంగా నూతన కొత్త గనులు సింగరేణికి వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విన్నవించడం జరిగిందన్నారు. అనంతరం కేంద్ర బొగ్గు సహాయ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి సింగరేణి భవిష్యత్తు పున్న ఆలోచించి కొత్త బావులు కేటాయించాలని విన్నవించమన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోవడం, గత ప్రభుత్వం నుండి ఇప్పుడున్న ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు రాకపోవడం వల్ల సింగరేణి సంస్థ ఆర్థికంగా వెనుకబడి పోతుందని తద్వారా ఓసీ, అండర్ గ్రౌండ్‌మైన్స్ మెటీరియల్ కొనే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఓసీలలో బొగ్గు తీసే పనులు ప్రయివేటు వారికి అప్పగించడం వ్యతిరేకించామన్నారు. బొగ్గు తీసే పనులు ప్రయివేటు వారికి ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం నడిపించాలని యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. డిస్మిస్ కార్మికులను మళ్లీ ఉద్యోగంలోకి తీసుకుంటారన్నారు. పెండింగ్‌లో ఉన్న మారు పేర్లు, కొత్తగా వచ్చే ఉద్యోగుల వయస్సు 35 నుండి 40 సంవత్సరాలకు పెంచామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ బొద్దుల వెంకటేష్, నర్సయ్య, వర్క్‌మైన్ ఇన్స్‌పెక్టర్లు సుభాష్ చంద్రబోస్, రాజ్ కుమార్, పిట్ కమిటీ సభ్యులు కేతాన్, కొమురయ్య, ఖాన్, నర్సిరెడ్డి, తిరుపతి, జీ, శివ, సాగర్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

నవతెలంగాణ-జైపూర్



పోలీస్ కుటుంబాలకు శాఖ పరంగా అండగా ఉంటామని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా భరోసా ఇచ్చారు. మంచిర్యాలలో గుండెపోటుతో మృతి చెందిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు భార్య విజయ కుమారికి శనివారం భద్రత ఎక్స్‌గ్రేషియా రూ.7,84,762 చెక్కును అందజేశారు. ఈ సంధర్భంగా మృతి చెందిన నాగరాజు కుటుంబ పరిస్థితులను అడిగి తెల్సుకున్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఓ శ్రీనివాస్‌తో కలిసి తన కార్యాలయంలో మాట్లాడుతూ నాగరాజు కుటుంబానికి ఇతర బెనిఫిట్స్ తక్షణమే అందేవిధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనరేట్ సూపరింటెండెంట్ సంధ్య, కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం



శుక్రవారం రాత్రి గాలి వానకు మండలంలోని మొర్రిగూడ గ్రామ శివారులో గాలికి ఒరిగిన మొక్క జొన్న, వారి ఇతర పంటలను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకొరిగిన పంటలను గుర్తించి పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అలాగే సింగరైపేట, తిమ్మాపూర్, రాంపూర్, కవ్వాల్, కిష్టపూర్, కలమడుగు గ్రామాలలో మొక్కజొన్న పంట నేల వాలి నష్టం జరిగిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నత అధికారులకు నివేదిస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు తమ పంటనులు చూయించి రికార్డులను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యసాయ అధికారిని పి సంగీత, ఏఈఓ దివ్య పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

నవతెలంగాణ-జన్నారం

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పీసీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ములుగు ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పీసీఆర్(పూర్ణ చందర్‌రావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాగుల శంకర్, కోటి జలంధర్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-నస్పూర్

బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ ముట్టడికి తలపెట్టిన నేపథ్యంలో నస్పూర్‌లో పలువురు నాయకులను సీసీసీ నస్పూర్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కాటం రాజు, నాయకులు సాజిద్, వంశీలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కూలిన ఇంటి గోడ..తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-కాసిపేట



మంలంలోని ముత్యంపల్లి ఎస్సీ కాలనీలో కోట రాజేశ్‌కు చెందిన ఇంటి గోడ కుప్ప కూలింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఇంట్లో గోడ పూర్తిగా కూలింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ భోజన్న ఆదేశాల మేరకు ఆర్ఐ కమల సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. స్థానిక నాయకులు మైదం రమేశ్, గోలేటి స్వామి ఉన్నారు.

స్లేట్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-జన్నారం



పిల్లలు కిండర్ గార్టెన్ విద్యను ముగించుకొని ఒకటవ తరగతిలోకి వెళ్ళబోతున్న సందర్భంగా మండలోని స్లేట్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏ శ్రీకాంత్‌రెడ్డి సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు భవిష్యత్తు విద్య ప్రణాళికలకు వారిని సిద్ధం చేయడం ఇది పిల్లలు ప్రి-ప్రైమరీ విద్య నుంచి ప్రైమరీ విద్యకు వెళ్తున్నందుకు వారి విద్య తరగతికి గుర్తుగా జరుపుతున్నామన్నారు. గ్రాడ్యుయేషన్ డే అనేది పిల్లలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రజితరెడ్డి, ప్రిన్సిపాల్ శిరిన్ ఖాన్, శ్యామ్ లాల్‌స, కృష్ణ, అకడమిక్ డైరెక్టర్స్ లావణ్య, రమ్య, బీనా, సమిన, రిజ్వాన్, విల్సన్ పాల్గొన్నారు.

వారసంతకు వేలంపాట

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పోనకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం జన్నారం వార సంత వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో వార సంతకు వేలం పాట నిర్వహించగా బినవేణి గంగన్న రూ.805000కు పాడి దక్కించుకున్నారని పంచాయతీ ఈఓ రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శి కలెక్టర్ అనిల్, మార్కెట్ చైర్మన్ లక్ష్మి నారాయణ, వైస్ చైర్మన్ షఫీ ఉల్ల పాల్గొన్నారు.

పంచాయితీ పనుల్లో వేగం పెంచాలి

నవతెలంగాణ-తాండూర్

పంచాయతీ పనుల్లో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శనివారం బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం ఆకెనపల్లి పంచాయతీలలో అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలలో తడి పొడి చెత్త సేకరణ కార్యక్రమం తప్పక నిర్వహించాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువ వుతున్నందున నర్సరీల్లో షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయనతో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



నవతెలంగాణ-తాంసి

భూగర్భజలాలు అడుగంటి పోకుండా ముందు జాగ్రత్తగా బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం సమ్మర్ యాక్షన్ భూగర్భ జలాల నీటి ఎద్దడి నివారణ కార్యక్రమంలో భాగంగా గిరిగాం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణ కోసం ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ భూముల్లో ఉన్న బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకొని అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా వ్యవసాయ అధికారులు ఉపాధి సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించి ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటుకు పోయి నీటి ఎద్దడి అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో తాగునీటిని వృథా చేయకుండా వాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లింగయ్య మండల వ్యవసాయ అధికారి రవీందర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి కార్తిక్, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పెరిగిన కరువుభత్యం అమలు చేయాలి

- టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో శనివారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుండి పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని, బీడీ పరిశ్రమల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని, పాయింట్ కు పది పైసల చొప్పున 10 రూపాయల 40 పైసలు, దీని ప్రకారం వేయి బీడీలకు మొత్తం కూలీ రేటు రూ.261.97పైసలు అవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులకు చాటల్ బట్టీ వాళ్లకు, నెలకు రూ. 312/-లు, బీడీ ప్యాకర్లకు రోజుకు 10రూపాయల 40 పైసల చొప్పున పెరిగిందన్నారు. పెరిగిన కరువు భత్యం రూపాయలను యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తే, కరువు భత్యం అమలు కోసం బీడీలు చుట్టే కార్మికులు నెలసరి జీతాల ఉద్యోగులు, బీడీ ప్యాకర్లు ఆందోళనకు సిద్ధం కావాలని బీడీ కార్మికులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం. బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రామలక్ష్మణ్, జిల్లా సహాయకార్యదర్శి ఎస్.గంగన్న, చిల్ల కోశాధికారి ఎండి.గఫూర్, పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల కళ్యాణ తలంబ్రాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణ తలంబ్రాలు బుకింగ్ కొరకు ప్రత్యేక కౌంటర్‌ను ఆదిలాబాద్ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌ను శనివారం డిపో మేనేజర్ జి.ప్రతిమా రెడ్డి పాల్గొని ప్రారంభించారు. భక్తులు కేవలం రూ.151 చెల్లించి ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణం తర్వాత టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ద్వారా మీ ఇంటి వద్దకే అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీరామ్, స్టేషన్ మేనేజర్ పోశెట్టి, లాజిస్టిక్స్ (కార్గో) ఇన్‌చార్జ్ అబ్దుల్ అన్సార్, మరిన్ని వివరాలకు 9154298531 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నిర్మల్‌టౌన్ : ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో జరగనున్న సీతారామచంద్రస్వామి కళ్యాణంలో వినియోగించిన తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా అందించనున్నట్లు డిపో మేనేజర్ పండరి తెలిపారు. శనివారం పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. సమయం దొరకక భద్రాచలం వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన తెలిపారు. నిర్మల్ బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయబడిందని రూ.151 చెల్లించి రశీదు ఉండాలని అనంతరం మీ ఇంటి వద్దకే తలంబ్రాలు అందిస్తామని డిపోమేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఎఆర్‌రెడ్డి కార్గో ఎగ్జిక్యూటివ్ కిషోర్ కుమార్, కంట్రోలర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం సీఎం ప్రజావాణి బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలకు సంబంధించి 74 దరఖాస్తులు రావడం జరిగిందని ఇందులో ఆరు దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించడం జరిగిందని మిగతా దరఖాస్తులను కూడా త్వరలో పరిష్కరిస్తామని ఎంపీడీఓ రాజ్ వీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్, ఎంపీఓ లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.